క్లుప్తంగా

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

దమ్మపేట: విద్యుత్ వినియోగదారుల సదస్సు (కోర్టు)ను సద్వినియోగం చేసుకోవాలని ఫోరం చైర్‌పర్సన్ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో నేడు(గురువారం) విద్యుత్ వినియోగదారుల సదస్సును ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో లోవోల్టేజీ సమస్యలు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చటం, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, నూతన సర్వీసుల మంజూరు తదితర విషయాలపై రాతపూర్వక ఫిర్యాదులు అందజేయవచ్చునని తెలియజేశారు. ఈ విద్యుత్ లోకల్ కోర్టును తప్పకుండా విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో చిన్నారులతో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎస్డీ రసూల్ కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దారావత్ రామారావు, ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి, కళ్లెం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలకు అభినందనలు

చర్ల: తెలంగాణా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన వైద్య ఆరోగ్య దినోత్సవంలో మండలంలోని చర్ల, సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలల్లో పని చేస్తున్న ఇద్దరు మహిళా సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాలు దక్కడంపై ఆయా వైద్యశాలలకు చెందిన వైద్యులు, సిబ్బంది, స్థానికులు వారిని అభినందించారు. భద్రాచలంలో జరిగిన వైద్య ఆరోగ్య దినోత్సవ సభలో చర్ల ప్రభుత్వ వైద్యశాలకు చెందిన స్టాఫ్ నర్సు కుంజా సరస్వతి, సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలకు చెందిన ల్యాబ్ టెక్నీషియన్ కారం కల్పనలకు ఉత్తమ సేవా పురస్కారాలు రాగా వీటిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష వారికి అందజేశారు. మరిన్ని పురస్కారాలు అందుకోవాలని వైద్యాధికారులు డాక్టర్ దివ్యనయన, డాక్టర్ మోనిక, డాక్టర్ శ్రీధర్ డీపీఎంఒలు సత్యనారాయణ, ముత్యాలరావు ఆకాంక్షించారు.

పుస్తకాలు పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని చింతాగుప్ప గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న తోగ్గూడెం గిరిజన పరిషత్ పాఠశాలలోని పిల్లలకు బ్యాగులు, నోటుపుస్తకాలు, యూనిఫాం, స్పోర్ట్స్ డ్రెస్‌లను సర్పంచ్ కట్టం కృష్ణ చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణ మాట్లాడుతూ.. ఐటీడీఏ కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకుని పిల్లలను అన్ని విధాలుగా తీర్చిదిద్దే విధంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వెంకట్, హెచ్‌యం రవి, ఉపాధ్యాయుడు నరేందర్, ఎస్ఎంసీ చైర్మన్ గంగరాజు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

ములకలపల్లి: మహిళలకు, ఆడపిల్లలకు అధిక వడ్డీతో పోస్టల్ శాఖ ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికేట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం ములకలపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం అధిక వడ్డీతో తీసుకువచ్చిన ఈ పథకం కేవలం పోస్టల్ శాఖ మాత్రమే అందిస్తుందన్నారు. ఒకరి పేరు మీద వేయి రూపాయాల నుండి, రెండు లక్షల వరకు రెండు సంవత్సరాల కాల పరిమితితో డిపాజిట్ చేసుకోవచ్చన్నారు. పాల్వంచ సబ్ డివిజన్ మెయిల్ ఓవర్‌సీర్ శేషు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటు చేయాలి

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీలోని శివలింగాపురం గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. శివలింగాపురంలో ఆరోగ్య ఉపకేంద్రం లేకపోవడంతో గర్భిణులులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్కే నాయుడు, భారతమ్మ పాల్గొన్నారు.

చేగువేరా జయంతి

చండ్రుగొండ: క్యూబా స్వాతంత్ర సమరయోధుడు చేగువేరా జయంతి కార్యక్రమాన్ని సీపీఎం కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. చెగువేరా చిత్రపటం ఎదుట విప్లవ జోహార్లు అర్పించారు. చెగువేరా జీవన విధానం ప్రపంచ యువతకు ఆదర్శప్రాయమన్నారు. నాయకులు రాయి రాజా, విప్పర్ల వెంకటేశ్వర్లు, ఆర్.వెంకటాచారి, దాసరి సీతారాములు, కె.నర్సింహారావు పాల్గొన్నారు.

చేరువలో చిరకాల స్వప్నం

- వేగంగా క్రీడామైదానం పనులు
- ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, ఎస్పీ, పీఓ
- రూ.2.27కోట్లతో నిర్మిస్తున్న క్రీడామైదానం



నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం



ఎర్ర గ్రావెల్‌తో చదును చేసే దశలో ఉన్న మైదానం

దుమ్ముగూడెం: ఏజెన్సీలోని యువతి, యువకుల కల నెరవేరనుంది. వారిలోని క్రీడా నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు, వారు సాధన చేసేందుకు మంచి క్రీడామైదానం లేదని గుర్తించిన జిల్లా అధికార యంత్రాంగం.. దాని ఏర్పాటుకు దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పక్కన ఉన్న 8 ఎకరాల 27 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించింది. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి నిధులు రూ.2.27కోట్లను క్రీడామైదానం నిర్మాణానికి మంజూరు చేసింది. దీంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ క్రీడామైదానం నిర్మాణం పనులను శరవేగంగా చేపట్టారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ఈ క్రీడామైదాన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు సాగుతుండగా గ్రౌండ్ మొత్తం ఎర్ర గ్రావెల్‌తో చదును చేస్తున్నారు.

మినీ స్టేడియం కోసం నిరీక్షిస్తున్న క్రీడాకారుల ఆశ ఎట్టకేలకు నెరవేరింది. ఇది పూర్తయితే మండలంలోని గ్రామీణ క్రీడాకారులకు క్రీడా మైదానం అందుబాటులోకి రానుంది. క్రీడామైదానం పూర్తయితే జిల్లా స్థాయి పోటీలు ఇక్కడ నిర్వహించే అవకాశాలు ఉన్నాయని గతంలో అప్పటి భద్రాచలం ఏఎస్పీ ఇప్పటి ఎస్పీ వినీత్, ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రూ ప్రకటించారు.

జిల్లా బాస్‌ల ప్రత్యేక దృష్టి..

దుమ్ముగూడెం మండలంలో రూ.2.27 కోట్లతో నిర్మిస్తున్న క్రీడా మైదానం నిర్మాణంపై జిల్లా కలెక్టర్ అనుదీప్, జిల్లా ఎస్పీ వినీత్‌లు ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. గతంలో ఇక్కడ సీఐగా విధులు నిర్వర్తించిన నల్లగట్ల వెంకటేశ్వర్లు క్రీడలపై మక్కువతో యువతకు క్రీడామైదానం అవసరం గుర్తించి దుమ్ముగూడెం వైద్యశాల అవరణలో తాత్కాలిక క్రీడామైదానాన్ని ఏర్పాటు చేసి అప్పటి భద్రాచలం ఏఎస్పీ, ఇప్పటి జిల్లా ఎస్పీ వినీత్, ఐటీడీఏ పీఓ గౌతమ్‌తో కలిసి ప్రారంభించారు. ఆ సమయంలో మండలంలో క్రీడామైదానం ఆవశ్యకతను గుర్తించిన అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని క్రీడామైదానం నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యేలా చేసారు. చర్ల, దుమ్ముగూడెం మండలానికి క్రీడామైదానంకు చెరో రూ.1కోటి మంజూరు కాగా ఎస్పీ వినీత్ చర్ల నిధులను కూడా దుమ్ముగూడెం మండలానికి కేటాయించి మొత్తం రూ.2.27 కోట్లు మంజూరు చేయించి క్రీడామైదానం నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

క్రీడాకారులకు కొదువలేదు..

మండల వ్యాప్తంగా అనేక క్రీడల్లో నైపుణ్యం కలిగిన యువత ఉన్నారు. కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో, పరుగుపందెం, టెన్నీస్, వాలీబాల్, టార్గెట్ బాల్, టెన్నీస్, చెస్, షటిల్, ఫుట్‌బాల్ ఇలా అనేక రకాల క్రీడల్లో రాణిస్తున్నప్పటికీ సరైన మైదానం అందుబాటులో లేకపోవడం, శిక్షకులు లేకపోవడంతో క్రీడాకారుల్లో, యువతలో ఉన్న నైపుణ్యం మరుగున పడిపోతోంది. స్థానిక గిరిజన యువతి, యువకులు ఉద్యోగ అన్వేషణలో భాగంగా పోలీస్, సీఆర్పీఎఫ్, రైల్వేలో జాయిన్ అయ్యేవారికి ఈవెంట్‌లు నిర్వహిస్తారు. ఆ ఉద్యోగాల్లో చేరే వారికి ఈ మైదానం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.

తొలగనున్న ఇబ్బందులు..

స్థానికంగా అనువైన క్రీడామైదానం లేక క్రీడాకారులకు ఇన్నాళ్లూ తిప్పలు తప్పలేదు. ఆటలో ప్రతిభ, నైపుణ్యం ఉన్న క్రీడాకారులు సాధన చేయడానికి సరైన మైదానాలు లేవు. గ్రామీణ క్రీడలు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ ఆడే వీరు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మైదానం లేక జిల్లా, డివిజన్ కేంద్రాల్లో సాధన చేస్తున్నారు. నిర్మాణం పూర్తయితే క్రీడాకారులకు ఇబ్బందులు తొలగనున్నాయి.

యువతకు ఉపయోగకరం



మండలంలో క్రీడామైదానం నిర్మించడం వల్ల గిరిజన, గిరిజనేతర యువతి, యువకులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. మండలంలో ఉన్న క్రీడాకారులు ఎక్కడికో వెళ్లి నిత్యం సాధన చేయాల్సిన పని లేకుండా మండల స్థాయిలోనే అందుబాటులోకి వస్తుంది. ప్రత్యేక చొరవ చూపిన అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– తెల్లం హరికృష్ణ, గోవిందాపురం యువకుడు

నాణ్యతలో రాజీలేకుండా పనులు



క్రీడామైదానం నిర్మాణంలో ఎక్కడా కూడ నాణ్యత విషయంలో రాజీ పడటం లేదు. ఉన్నతాధికారుల సూచనల మేరకు మైదాన నిర్మాణ పనులు నిర్వహిస్తున్నాం. ఈ మైదానంలో ఇండోర్ కోర్టు, ప్లేగ్రౌండ్, షటిల్ కోర్టు, వాలీబాల్ కోర్టు, సిక్స్ ట్రాక్‌లతో పాటు పలు కోర్టులు నిర్మాణం అవుతాయి.

– వెంకటేశ్వర్లు, ఐటీడీఏ ఏఈ

మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ

మణుగూరురూరల్: ఈ నెల 17, 18 తేదీల్లో జరగబోయే ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) తెలంగాణ రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్ పోస్టర్లను బుధవారం మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేదర మెట్ల శ్రీనివాసరావు, న్యాయవాదులు పానుగోటి కిషన్, పోశం భాస్కర్, రామ్మోహన్, జాడి చొక్కారావు, శైలజ, సరస్వతి, విజయలక్ష్మి, కవిత, నగేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు

అడవిని ముడితే కఠిన చర్యలు

మణుగూరురూరల్: రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో ఎవరైనా ట్రాక్టర్, డోజర్ యజమానులు దున్నినా, చదును చేసినా.. వారిపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మణుగూరు ఎఫ్‌డీఓ సయ్యద్ మక్సూద్ మొహియుద్దీన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అభయారణ్య ప్రాంతాల్లోని భూముల్లో ట్రాక్టర్, డోజర్ యజమానులు అటవీశాఖ చట్టాలకు వ్యతిరేకంగా దున్నినా, చదును చేసినా ట్రాక్టర్, డోజర్లను జప్తు చేసి అటవీశాఖ చట్టం 1967, సంరక్షణ చట్టం 1980, వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 కింద యజమానులపై కేసులు నమోదు చేస్తామని, కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. అలాగే కొంతమంది గిరిజనులు ఆర్‌ఓఎఫ్‌ఆర్ హక్కు పత్రాలు కలిగిన భూముల్లో కాకుండా వేరు అటవీ భూముల్లో దున్నడం, చదును చేయడం వంటి పనులకు, మరికొంతమంది కేటాయించిన భూమి విస్తీర్ణం పెంచి ఆక్రమించి దున్నించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, పలువురు ఫిర్యాదు సైతం చేశారని తెలిపారు. మరికొంతమంది నకిలీ ధృవపత్రాలు చూపించి అటవీ భూమిని ఆక్రమించుకుంటున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. మణుగూరు డివిజన్ అటవీశాఖ పరిధిలో చాలా వరకు అటవీ భూమిగా ఉన్నందున ప్రతీ ఒక్క ట్రాక్టర్, డోజర్ యజమాని సమీప అటవీశాఖ అధికారిని సంప్రదించి అటవీ భూమా.. కాదా నిర్ధారించుకున్న తర్వాతే దున్నే పనులు, చదును చేసే పనులు చేసుకోవాలని సూచించారు.

సీసీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

మణుగూరురూరల్: మణుగూరు ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆస్పత్రిలో రూ.50 లక్షలతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తూ.. ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు అడపా అప్పారావు, తాతా రమణ, ముద్దంగుల కృష్ణ, దర్శినాల శ్రీను, నైనారపు నాగేశ్వరరావు, అక్కిరెడ్డి సంజీవరెడ్డి, నవీన్‌బాబు, ప్రభుదాస్, జావిద్‌పాషా, రామిరెడ్డి, ఎండీ యూసఫ్ షరీఫ్, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

చెట్ల పొదల్లో చెలరేగిన మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మణుగూరురూరల్: మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామపంచాయతీ పరిధి ప్రధాన రహదారి పక్కనే ఉన్న చెట్ల పొదల్లో బుధవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న పంచాయతీ సర్పంచ్ కాయం తిరుపతమ్మ వెంటనే అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా.. గాలి ప్రతికూలించకపోవడంతో కష్టతరమైంది. ఈ క్రమంలోనే సర్పంచ్ బీటీపీఎస్ అధికారులను సమాచారం అందించగా.. వారు స్పందించి అగ్నిమాపక వాహనాన్ని సైతం పంపించారు. దీంతో రెండు అగ్నిమాపక యంత్రాల సహాయంతో సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చి ఆర్పివేశారు. సమాచారం అందించిన వెంటనే స్పందించి మంటలను ఆర్పేందుకు సహకరించిన అధికారులకు, అగ్నిమాపక సిబ్బంది సర్పంచ్ తిరుపతమ్మ, గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రామకృష్ణ

భద్రాచలంటౌన్: భద్రాచలం మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రామకృష్ణ బుధవారం బాధ్యతలను చేపట్టారు. భద్రాచలం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ యాదవ్‌కు ఎన్నికల సంబంధించిన విధులను ఉన్నతాధికారులు అప్పగించారు. దీంతో భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణను ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

దరఖాస్తు చేసుకోండి

చండ్రుగొండ: బీసీ సంక్షేమశాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రుణాల కోసం చేతివృత్తిదారులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జి.రేవతి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఆధార్ కార్డ్, కులధృవీకరణ, ఆదాయం, బ్యాంక్ ఎకౌంట్ పాస్‌బుక్, రేషన్‌కార్డ్‌ల జిరాక్స్ కాపీలను దరఖాస్తుతో జతచేసి ఈ నెల 20వ తేదీలోపు ఎంపీడీఓ కార్యాలయంలో అందించాలన్నారు.

సరుకులు అందజేత

గుండాల: మండలంలోని బాటన్న నగర్ గ్రామంలోని పోషకాహార లోపంతో ఉన్న పిల్లలకు చేతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహార సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యుడు దొడ్డ సీతారామయ్య మాట్లాడుతూ.. టీఆర్ సత్యనారాయణ జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఆదివాసీలకు ఈ పౌష్టిక ఆహార సరుకులను అందించినట్లు తెలిపారు. వీటిని ఆరు నెలల పాటు అందిస్తామని, రెండో నెలకు సంబంధించి ప్రస్తుతం అందించామని వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు సత్తులాల్, చంద్రకాని, నవీన్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు అన్యాయం

దుమ్ముగూడెం: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో నిజమైన దళితులకు అన్యాయం జరిగిందని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి జెట్టి వెంకట్రాజు విమర్శించారు. బుధవారం గంగోలు గ్రామంలో జరిగిన బీజేపీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం బీసీసీలకు దళితబంధు కేటాయించారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తెల్లం శేఖర్, నాయకులు కామయ్య, చలపతి, వసంతరావు, రాఘవయ్య, వెంకటేశ్వర్లు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

మణుగూరురూరల్: భారతీయ జనతా పార్టీలో భూక్యా తారప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు యువకులు బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో చేరారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జాడి దేవేంద్రవరప్రసాద్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కృష్ణవేణి, చిత్రా సరస్వతి, పున్నం బిక్షపతి, రామకృష్ణ, కిషోర్‌బాబు, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య రంగానికి ప్రాధాన్యత



వైద్య, ఆరోగ్య శాఖ విజయాలను స్క్రీన్‌పై వీక్షిస్తున్న విప్ రేగా

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. బుధవారం స్నేహగార్డెన్స్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ వైద్య, ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రేగా కాంతారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే రేగా కాంతారావుకు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ సాధించిన విజయాలను ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ఆయన వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు. ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ వైద్య, ఆరోగ్యశాఖకు నిధులు కేటాయిస్తున్నారని, అధునాతన పరికరాలు, వసతులను సమకూర్చుతున్నారని తెలిపారు. ప్రతీ జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. అనంతరం ఉత్తమ వైద్యసేవలు అందించిన వైద్యులకు, వైద్యసిబ్బందికి ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను, బాలింతలకు కేసీఆర్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ జెవిఎల్ శిరీష, మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, సర్పంచ్‌లు ఏనిక ప్రసాద్, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

భద్రాచలంటౌన్: చదువుకునే బాలికలు ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు వహించాలని భద్రాచలం పట్టణ ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ చల్లగుళ్ల స్పందన అన్నారు. భద్రాచలం పట్టణంలోని గిరిజన గురుకుల ఆశ్రమ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం నిర్వహించిన ఆరోగ్యం పరిరక్షణ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఆరోగ్య రక్షణ చర్యలు పాటిస్తే విజయవంతంగా విద్యాభ్యాసాన్ని కొనసాగించవచ్చని సూచించారు. అనంతరం విద్యార్థినులకు పలు రకాల అనారోగ్య సమస్యలు, పరిష్కారాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సత్యనారాయపురం వైద్యురాలు డాక్టర్ నవ్య నయనా, టీఎన్జీఓ మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ విభాగం ప్రారంభం



ఏరియా ఆస్పత్రిలో ఈఎన్‌టీ వార్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరయ్య

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో బుధవారం భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఈఎన్‌టీ ఓపీ విభాగాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఎన్టీ వైద్యుడు సంతోష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎంఓ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ..

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య తండ్రి ఓరుగంటి వెంకటేశ్వర్లును బుధవారం భద్రాచలం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య పరామర్శించారు. వెంకటేశ్వర్లుకు ఇటీవల కాలుకు గాయమై ఖమ్మంలో చికిత్స అనంతరం ఇంటికి రాగా పొదెం వీరయ్య పరామర్శించారు. ఆరోగ్యం విషయాలు తెలుసుకొని మనోధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బూర లక్ష్మీనారాయణ, గాదె కేశవరెడ్డి, బొల్లం అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడిగా రాంబాబు

భద్రాచలంఅర్బన్: గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడిగా బెల్లంకొండ రాంబాబు ఎన్నికయ్యారు. బుధవారం గ్రీన్ భద్రాద్రి సర్వసభ్య సమావేశం స్థానిక లయన్స్ క్లబ్ బిల్డింగ్‌లో జరిగింది. సమావేశంలో 2023–24 సంవత్సరానికి నూతన పాలకవర్గ సభ్యులను ఎంపిక, ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాలు, ఆర్థిక నివేదిక సమర్పణ తదితర కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం 2023–24 సంవత్సరానికి నూతన అధ్యక్షుడిగా రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా శ్రీరంగం సంపత్, కోశాధికారిగా విష్ణుమొలకల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా ఏ. ఉమాశంకర్ నాయుడు, పూసం రవికుమారి, లీగల్ అడ్వైజర్‌గా పామరాజు తిరుమలరావు, పీఆర్ఓగా లకావత్ వెంకటేశ్వర్లు తదితరులను గ్రీన్ భద్రాద్రి ట్రస్ట్ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం ట్రస్ట్ అధ్యక్షుడు యేగి సూర్య నారాయణ నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కామిశెట్టి కృష్ణార్జునరావు, గ్రీన్ భద్రాద్రి ఫౌండర్ జి.రాజారెడ్డి, ట్రస్ట్ అధ్యక్షుడు యేగి సూర్యనారాయణ, తెలంగాణా సైనిక్ డైరెక్టర్ తిప్పిన సిద్ధులు, అడుసుమిల్లి జగదీష్, చావా లక్ష్మీనారాయణ, హరిశ్చంద్ర నాయక్, గ్రీన్ భద్రాద్రి గౌరవాధ్యక్షుడు డాక్టర్ గోళ్ల భూపతిరావు, బోగాల శ్రీనివాస రెడ్డి, లయన్స్ క్లబ్ ఎలక్టెడ్ ప్రెసిడెంట్ భీమవరపు వెంకటరెడ్డి, కట్టా నాగేంద్రబాబు, చారుగుళ్ల నాగభూషణం, ఆర్.రామకృష్ణారెడ్డి, రామలింగేశ్వరరావు, మహమ్మద్ రఫీ, ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి, తంగేటి కృష్ణ, రాణి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

చండ్రుగొండ: మండలంలోని రెండు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బుధవారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. తిప్పనపల్లికి చెందిన పానుగంటి ప్రసాద్‌కు రూ.24 వేలు, మద్దుకూరుకు చెందిన పాయం రాకేష్‌కు రూ.60 వేల చెక్కులను అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు, సయ్యద్ రసూల్, ఉన్నం నాగరాజు, నల్లమోతు వెంకటనారాయణ, సత్తి నాగేశ్వరరావు, భూపతి రమేష్, క్లోం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



భద్రాచలంఅర్బన్: రక్తదానం చేస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లు

భద్రాచలంఅర్బన్: 18 ఏళ్ల నిండి ఆరోగ్యవంతులైన ప్రజలందరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకురావాలని ఎమ్మెల్యే పొదెం పొదెం వీరయ్య కోరారు. బుధవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పొదెం వీరయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏజెన్సీలో ఎంతో మంది రక్తహీనతతో బాధపడుతున్నారని, రక్తదానంతోనే వారిలో ఎంతో మందిని బతికించవచ్చని అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాచలం వారిని అభినందించారు. అనంతరం క్షయ వ్యాధితో బాధపడుతున్న 60 మందికి పౌష్టికాహార కిట్లను డాక్టర్ ఏ.మోహన్‌రావు ఆర్థిక సహాయంతో అందజేశారు. అనంతరం రెడ్ క్రాస్ జిల్లా బాధ్యులు డా.ఎస్ఎల్ కాంతారావు మాట్లాడుతూ.. గడిచిన 2 రోజులలో 46 రక్తదానం చేసినట్లు, అందుకోసం చేయూత స్వచ్ఛంద సంస్థ, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్, సీఐఎస్ఎఫ్ అండ్ హెవీ వాటర్ ప్లాంట్ వారు సహకారమందిచినట్లు పేర్కొన్నారు. అనంతరం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ద్వారా పురస్కారం అందుకున్న కొప్పుల మురళిని అభినందించారు. కార్యక్రమంలో ఊహం కాంతారావు, సూర్యనారాయణ, జి.రాజారెడ్డి, వై.భానుప్రసాద్, టి.సిద్ధులు, బుడగం శ్రీనివాస్, భోగాల శ్రీనివాస రెడ్డి, సరేళ్ల నరేష్, బాబు, ఆది తదితరులు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో రక్తదానం

భద్రాచలంఅర్బన్: కూనవరం రోడ్డులోని 141 సీఆర్పీఎఫ్ బెటాలియన్ క్యాంప్‌లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బెటాలియన్ సభ్యులతో పాటు కమాండెంట్ ప్రశాంత్ ధర్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ ప్రశాంత్ మాట్లాడుతూ అత్యవసర సమయాలలో ఎవరికైనా రక్తం అవసరం అయితే రక్తాన్ని దానం చేయడం తప్ప మరో మార్గం లేదన్నారు. రక్తదానం శిబిరం ఏర్పాటుకు సహకరించిన భద్రాచలం ఏరియా ఆస్పత్రి పర్యవేక్షకులు, సిబ్బందికి కృతజ్ఞతలు.. రక్తదానం చేసిన తన తోటి అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ బెటాలియన్ టు ఇన్‌చార్జ్ కమల్ వియర్ యాదవ్, సింగర్ వేల్, కల్పన, ఎస్ఎంఓ విజయ్ కిషోర్ రెడ్డి, ఎస్ఎంఓ సోంజిత్ భగత్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో సీఆర్పీఎఫ్ 2వ బెటాలియన్ కమాండెంట్ రతీకాంత బెహెరా ఆధ్వర్యంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ కుమార్ నేతృత్వంలో సీఆర్పీఎఫ్ జవాన్లు రక్తదానం చేశారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి.. 32 యూనిట్ల రక్తాన్ని అందజేశారు. శిబిరంలో సెకండ్ ఇన్ కమాండెంట్ పవన్‌కుమార్, డిప్యూటీ కమాండెంట్ భాస్కర్ భట్టాచార్య, సహ కమాండెంట్ రాజేంద్రకుమార్ కూడా రక్తదానం చేసి మనోధైర్యాన్ని అందజేశారు.